# ఎరువుల ధరల తగ్గింపు బూటకం

**అంతర్జాతీయ** మార్కెట్‌లో ఎరువు ముడిపదార్థాల ధరలు తగ్గాయి. ఆ మేరకు ఎరువు విక్రయధరలు తగ్గాలి. ఎన్‌డిఏ ప్రభుత్వం నామమాత్రంగా ధరలు తగ్గించి, తానిచ్చే సబ్సిడీని తగ్గించుకొని రైతాంగంపై భారం మోపుతున్నది.

పంటల ఉత్పత్తిలో నేడు ఎరువులు కీలకపాత్ర పోషిస్తున్నాయి. రసాయన ఎరువులు వాడకుండా దిగుబడులు రాని పరిస్థితికి సేద్యం చేరుకొంది. 1966లో సస్యవిప్లవం పేరుతో పాలకులు అధిక దిగుబడులకోసమంటూ విదేశాలనుండి ఎరువులు దిగుమతి చేసుకొన్నారు. అంతకుముందు పశువుల ఎరువు, వేరుశనగపిండి, వేపపిండితోపాటు కొద్దిమోతాదులో అమ్మోనియా ఇతర ఎరువులను పైరుకు రైతులు ఉపయోగించారు. సస్యవిప్లవం పేరుతో ఎరువుల దిగుమతితో సాంప్రదాయ ఎరువుల వాడకం నామమాత్రమైంది. రసాయన ఎరువుల వాడకం వలన భూమి సారహీనంగా మారింది.

దేశంలో ఎరువుల వినియోగం గణనీయంగా పెరుగుతూ వుంది. 1951-52 సం॥లో ఎరువుల వాడకం 70వేల టన్నులు వుంటే 2014-15 నాటికి రెండు కోట్ల 56 లక్షల టన్నులకు చేరుకొంది. అవసరానికి సరిపడా దేశంలో ఉత్పత్తి జరగకపోవటంవలన దిగుమతులపై ఆధారపడాల్సి వస్తున్నది. గత 19 సంవత్సరాల కాలంలో కొత్తగా ఒక్క ఎరువుల ఫ్యాక్టరీకూడా దేశంలో నిర్మించబడలేదు. ఎరువుల ధరల నూతన విధానం అమలులోకి రావటంతో కోరమాండల్ ఫెర్టిలైజర్ కంపెనీ యూరియా ఉత్పత్తిని 15 లక్షల నుండి 22 లక్షల టన్నులకు పెంచటానికి అనుమతిపొందింది. గత పది సంవత్సరాల కాలంలో ఎరువుల ఉత్పత్తి, దిగుమతి, వినియోగం ఈవిధంగా వుంది.

**దేశంలో వివిధ రకాల ఎరువుల ఉత్పత్తి-దిగుమతి-వినియోగం(లక్షల టన్నుల్లో)**

| సంవత్సరం | నత్రజని | | | భాస్వరం | | | పొటాష్ | | | మొత్తం ఎరువులు | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | ఉత్పత్తి | దిగుమతి | వినియోగం | ఉత్పత్తి | దిగుమతి | వినియోగం | ఉత్పత్తి | దిగుమతి | వినియోగం | ఉత్పత్తి | దిగుమతి | వినియోగం |
| 2005-06 | 113.54 | 13.85 | 127.23 | 42.21 | 11.22 | 52.04 | 0 | 27.47 | 24.13 | 155.75 | 52.54 | 203.40 |
| 2010-11 | 121.57 | 44.93 | 165.58 | 42.23 | 38.02 | 80.50 | 0 | 40.49 | 35.14 | 163.80 | 123.64 | 281.22 |
| 2014-15 | 123.94 | 47.66 | 169.46 | 38.75 | 18.32 | 60.98 | 0 | 25.37 | 25.32 | 162.69 | 91.35 | 255.76 |

ఆధారం: కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖ. ఈనాడు 21-7-16

ఈ పట్టికను గమనిస్తే వినియోగ ఎరువుల్లో ఏదీ కూడా దేశంలో పూర్తిగా ఉత్పత్తి కావటం లేదని అర్థమౌతుంది. పొటాష్ పూర్తిగాను, నత్రజని, భాస్వరం ఎరువులు కూడా పెద్దఎత్తున దేశంలోకి దిగుమతి అవుతున్నాయి.

దేశంలో రైతాంగానికి అందుతున్న సబ్సిడీ ప్రధానంగా ఎరువులపైనే. సస్యవిప్లవం కాలంలో విదేశీ కంపెనీలు ఎరువుల కొనుగోలుకు రైతులను ప్రోత్సహించేందుకు ప్రపంచబ్యాంక్ ఉచిత ఆర్థిక సహాయం ప్రభుత్వానికి అందించింది. ఎరువుల వాడకం ఎక్కువైన తర్వాత సహాయాన్ని నిలిపివేసింది. అమెరికా-యూరోపియన్ యూనియన్ దేశాల్లో పెద్దఎత్తున రైతులకు (భూకామందులకు) సబ్సిడీలు అందుతున్నాయి. వరి, చెరకు మొదలైన పంటలకు మొత్తం ఉత్పత్తి విలువకు మించి ఆయా దేశాల ప్రభుత్వాలు సబ్సిడీలు ఇస్తున్నాయి. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు కాపాడే భారత పాలకులు తప్పనిసరి పరిస్థితుల్లో ఎరువులపై సబ్సిడీ కొనసాగించారు. ఇతర దేశాలు ఇస్తున్న సబ్సిడీలను దృష్టిలో పెట్టుకొంటే భారత పాలకులు యిచ్చేది కన్నీటి తుడుపే. ప్రపంచ వాణిజ్య ఒప్పందం, వ్యవసాయ ఒడంబడిక అమల్లోకి వచ్చిన తర్వాత వివిధ దేశాల్లో రైతాంగానికి యిచ్చే సబ్సిడీలను దశల వారీగా ఏవిధంగా తగ్గించాలి అన్న ఒప్పందానికి వచ్చారు. ఇది వెనుకబడిన దేశాలకు నష్టదాయకమైంది. వ్యవసాయ ఒప్పందం ప్రకారం ఎరువుల సబ్సిడీని తగ్గించాలని ప్రపంచబ్యాంక్ భారత పాలకులపై వత్తిడి ప్రారంభించింది. అమెరికా-యూరోపియన్ యూనియన్ దేశాలు ఒప్పందాన్ని అమలుపర్చకుండా "గ్రీన్ బాక్స్" పేరుతో గతంలో యిచ్చిన సబ్సిడీలకన్నా దొంగచాటుగా పెద్దఎత్తున ఇస్తున్నాయి. దాన్ని ప్రశ్నించలేని భారత పాలకులు రైతులకు ఇస్తున్న సబ్సిడీకి వివిధ రూపాల్లో కోతపెట్టడం ప్రారంభించారు. 2010 మార్చి వరకు అన్ని ఎరువులకు ఒకే విధమైన సబ్సిడీ అమల్లో వుంది. 2011 నుండి ఎరువుల్లో ఉన్న పోషకాలను బట్టి సబ్సిడీని యిస్తామని అప్పటి యుపిఏ ప్రభుత్వం ప్రకటించింది. దీనివలన పెద్దఎత్తున రైతులు సబ్సిడీని కోల్పోయి అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తున్నది. రైతులకు అందుతున్న సబ్సిడీనే నామమాత్రంగా వుంటే, దానిలో కూడా కోతపెట్టడం పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలకు, సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు అద్దంపడుతున్నది. గత ఐదు సంవత్సరాల్లో రైతాంగానికి పాలకులు యిచ్చిన సబ్సిడీలు గమనిద్దాం. **(పట్టిక 2వ పేజీలో)**

గత ఐదు సంవత్సరాల కాలంలో ఎరువులపై రైతాంగానికి యిస్తున్న సబ్సిడీ 75 వేల కోట్లకు మించిలేదు. తమ చెమట బిందువులద్వారా ఆహార ధాన్యాలు పండించి దేశప్రజలకు ఆహారాన్ని అందిస్తూ, సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ అందులో నుంచి

బయటపడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతాంగానికి యిస్తున్న కొద్దమేర సబ్సిడీకే కుహనా మేధావులు, ఆర్థికవేత్తలు గగ్గోలుపెడుతున్నారు. రైతులకు ఇస్తున్న సబ్సిడీ వలన దేశ ఆర్థికవ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, ఆర్థిక సంక్షోభానికి సబ్సిడీలే కారణమన్నట్లుగా ప్రచారం చేస్తున్నారు. అన్నంపెట్టే రైతాంగానికి ఇస్తున్న నామమాత్రపు సబ్సిడీకి గగ్గోలుపెట్టే కుహనా ఆర్థికవేత్తలు, ప్రతిసంవత్సరం పాలకులు బడాపెట్టుబడిదారులకు ఐదులక్షల కోట్ల రూపాయలు రాయితీ యిస్తున్న విషయం, గత రెండు సంవత్సరాల కాలంలో పారుబకాయల పేరుతో 4.5 లక్షలకోట్ల రూపాయలను మాఫీచేసిన విషయం మాట్లాడేందుకు నోరు ఎందుకు పడిపోయింది? దేశంలో ఆర్థిక సంక్షోభానికి బడాపెట్టుబడిదారులు, వారి ప్రయోజనాలు కాపాడే పాలకులు కారణమా? లేక దేశ ప్రజలకు అన్నంపెట్టే రైతాంగం కారణమా? ఈ ప్రశ్నకు ఈ కుహనా మేధావులు సమాధానం చెప్పాలి.

**గత ఐదు సంవత్సరాల్లో దేశంలో ఎరువుపై సబ్సిడీ (కోట్ల రూపాయల్లో)**

| సంవత్సరం | యూరియా | | | భాస్వరం, పొటాష్ | | | మొత్తం ఎరువులు | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | దేశీయ ఉత్పత్తి | దిగుమతులపై | మొత్తం | దేశీయ ఉత్పత్తి | దిగుమతులపై | మొత్తం | దేశీయ ఉత్పత్తి | దిగుమతులపై | మొత్తం |
| 2010–11 | 15,080 | 13,906 | 29,906 | 16,000 | 20,850 | 36,080 | 31,080 | 34,756 | 65,836 |
| 2011–12 | 20,285 | 12,984 | 33,269 | 20,650 | 16,572 | 37,222 | 40,935 | 33,634 | 74,569 |
| 2012–13 | 20,600 | 16,074 | 36,074 | 19,942 | 14,576 | 34,518 | 39,942 | 30,650 | 70,592 |
| 2013–14 | 26,500 | 14,354 | 41,354 | 16,000 | 13,928 | 29,926 | 42,500 | 28,780 | 71,280 |
| 2014–15 | 38,200 | 16,200 | 54,400 | 12,000 | 8,667 | 20,667 | 50,200 | 24,867 | 75,067 |

ఆధారం: భారత ప్రభుత్వ గణాంకాల మేరకు, ఈనాడు 21-7-16

ఎరువులకి యిస్తున్న రాయితీలు ఎత్తివేస్తే ఎరువుల ధరలు పెరిగి రైతులు అధిక ధరలకు కొనుగోలు చేయాల్సివస్తుంది. ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు అధిక ధరలు పెట్టి ఎరువులు కొనలేక వాటి వాడకం తగ్గించుకోవాల్సి వస్తుంది. ఫలితంగా ఆహారధాన్యాల దిగుబడి తగ్గుతుంది. "నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ పాలసీ" అధ్యయనం కూడా ఎరువుల రాయితీ ఎత్తివేస్తే పదిశాతందాకా ఆహారధాన్యాల దిగుమతి తగ్గుతుందని పేర్కొంది. ప్రభుత్వం యిచ్చే సబ్సిడీలు ప్రధానంగా చిన్న, సన్నకారు రైతులకు అందాలి. దేశంలో భూస్వాములే ఎక్కువగా సబ్సిడీ ప్రయోజనం పొందుతున్నారు. భూస్వాములకు సబ్సిడీలు ఇవ్వాల్సిన అవసరంలేదు. వారికి యిచ్చే సబ్సిడీలు చిన్న, సన్నకారు రైతులకు బదలాయిస్తే వారికి ఎంతో ప్రయోజనంగా వుంటుంది. ఇతర దేశాల్లో ఇస్తున్న సబ్సిడీలను దృష్టిలో పెట్టుకొని, తాము ఇస్తున్న సబ్సిడీలను దేశపాలకులు గణనీయంగా పెంచాల్సి వుంది. అలాంటి విధానాలు పాలకులు అమలుపర్చటంలేదు.

ఎరువుల ధరలు భారతదేశంలో కాకుండా అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా నిర్ణయించబడుతున్నాయి. బహుళజాతి సంస్థలు అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వాటి లాభాలకు అనుగుణంగా ధరలు ప్రకటించబడు తున్నాయి. పెద్దఎత్తున ఎరువల దిగుమతి చేసుకోవటం వలన భారత రైతాంగం దోపిడీకి గురౌతున్నారు. 2010 మార్చి వరకు ఎరువుల ధరల నిర్ణయాధికారం కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలో భాగంగా ప్రపంచబ్యాంక్ వత్తిడి మేరకు ఎరువుల ధరల నిర్ణయాధికారాన్ని వదులుకొని, ఎరువుల కంపెనీలకే దాన్ని కట్టబెట్టింది. ఎరువుల కంపెనీలు ధరలను తమ ఇష్టమొచ్చినట్లు పెంచుతూ వచ్చాయి. కంపెనీల లాభాపేక్షకు 2010 మార్చిలో వున్న డి.ఏ.పి. బస్తాధర 486 రూ. నుండి 2012 నాటికి 1260 రూ.కు, ఎం.ఓ.పి. ధర 234 రూ. నుండి 834 రూ.కు పెరిగాయి. ఒక్క ఏడాది కాలంలోనే 11 సార్లు ఎరువుల ధరలను కంపెనీలు పెంచాయి.

గత పది సంవత్సరాల కాలంలో ఎరువుల ధరలు పెరుగుతూనే వున్నాయి. ఈ సంవత్సరమే అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ముడిపదార్థాల ధరలు తగ్గాయి. డి.ఏ.పి. ధర టన్నుకు 464 డాలర్ల నుండి 355 డాలర్లకు తగ్గింది. ఇది భారత కరెన్సీలో 7700 రూపాయలకు సమానం. ఇతర ముడిపదార్థాల ధరలు తగ్గాయి. ఎరువుల ధరలు తగ్గాయని ప్రచారం చేస్తున్నవారు, పెరిగిన ధరల్తో పోల్చుకొంటే తగ్గింది స్వల్పమన్నది, తిరిగి ధరలు పెరుగుతాయన్నది మర్చినట్లువున్నారు. ఎన్.డి.ఏ. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పోషకవిలువలు, పోషణ విలువల ఆధారంగా ఇస్తున్న సబ్సిడీ ఎరువుల ధరలు పెరిగినప్పుడు పెంచాల్సి వుంది. ఆ విధానాన్ని అమలు జరపలేదు. ముందు నిర్ణయించిన సబ్సిడీనే ఇస్తున్నది. గత సంవత్సరం (2015-16)లో కేంద్ర ప్రభుత్వం డి.ఏ.పి. మీద టన్నుకు 12,350 రూపాయల సబ్సిడీ యిచ్చింది. ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా ఎరువుల ధరలు తగ్గినా ఇస్తున్న సబ్సిడీని కొనసాగించాల్సి వుంది. కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. ఎరువుల ధరలు పెరిగినప్పుడు సబ్సిడీ పెంచని ప్రభుత్వం, ధరలు తగ్గినప్పుడు సబ్సిడీని తగ్గించకూడదు. ధరలు తగ్గాయనే నెపంతో గత సంవత్సరం యిచ్చిన 12,350 రూ. సబ్సిడీని 8,945 రూపాయలకు తగ్గించింది. యథాతథంగా సబ్సిడీని కొనసాగించి వుంటే

డి.ఏ.పీ. బస్తాకు 170 నుండి 190 వరకు తగ్గేది. సబ్సిడీ తగ్గటంవలన డి.ఏ.పీ.కి 125 రూ; పొటాష్‌కి 250 రూ మేరకే ధర తగ్గింది. తగ్గిన ఎరువుల ధరల రేట్లు కూడా ఎప్పుడు అమల్లోకి వస్తాయో చెప్పలేదు. ఈ విధంగా కేంద్రప్రభుత్వం రైతాంగ ప్రయోజనాలు దెబ్బతీసి, తాను యిస్తున్న సబ్సిడీని తగ్గించుకొంది.

నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులకు మాత్రమే ధరలు తగ్గాయి. యూరియాకు ధర తగ్గలేదు. దిగుమతి చేసుకొంటున్న ఎరువుల్లో యూరియానే ఎక్కువగా వుంది. అన్నిరకాల ఎరువులు ఎంతమొత్తంలో వాడుతున్నారో అంతకు రెట్టింపు యూరియాను రైతాంగం వినియో గిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఎక్కువగా వుండటంతో ఖర్చు తగ్గించుకొనేందుకు చిన్న, సన్నకారు రైతులే కాకుండా, ధనిక రైతులు కూడా ఎక్కువ యూరియాని పైరుకి వాడుతున్నారు. యూరియా వాడకం వలన భూమి గుల్లబారుతున్నా, చీడపీడలు వ్యాపించినా దాన్నే వాడాల్సిన పరిస్థితి రైతాంగానికి ఏర్పడింది.

ఎరువుల ముడిపదార్ధాలు అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగాయని ధరలు పెంచేందుకు కంపెనీలకు అనుమతి యిస్తున్న పాలకులు, ముడిసరుకుల ధరలు తగ్గినప్పుడు ఎరువుల ధరలను ఎందుకు తగ్గించటంలేదు? ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం రైతాంగాన్ని దారుణమైన దోపిడీకి గురిచేస్తున్నది. 2022 నాటి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఊదరగొడుతున్న పాలకులు, ఎరువుల సబ్సిడీని పెంచకుండా, పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించకుండా, సేద్యపు ఖర్చులు తగ్గించకుండా రైతుల ఆదాయాన్ని ఎలా పెంచగలుగుతుంది?

ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను అర్ధం చేసుకొని 2010 మార్చి నాటికి వున్న విధంగా ఎరువుల ధరలు తగ్గించాలనీ, అవసరాలకు అనుగుణంగా ఎరువుల ఉత్పత్తి దేశంలోనే జరగటానికి ప్రభుత్వం కొత్త కర్మాగారాలు నిర్మించాలనీ, ఎరువుల సబ్సిడీని పెంచాలనీ, ప్రభుత్వమే ఎరువుల ధరలను నిర్ణయించాలనీ, అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గిన దానికి అనుగుణంగా ప్రస్తుతం ఎరువుల ధరలు తగ్గించాలనీ రైతాంగం ఉద్యమించాలి.

ooooo